క్లుప్తంగా...

చార్మినార్ వద్ద 'స్వచ్ఛతా హీ సేవ'



చార్మినార్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ కట్టడం వద్ద ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురానీహవేలీకి చెందిన విద్యార్థులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి శిరీషా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను విద్యార్థుల చేత నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి తమ పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



పురానాపూల్ గాంధీ బొమ్మ వద్ద నిరసన

జియాగూడ: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, జాబ్‌చార్ట్ ప్రకటించాలని సీఐటీయూ గోషామహల్ జోన్ నాయకుడు టి.నాగేశ్వర్ అన్నారు. మంగళవారం పురానాపూల్ గాంధీ బొమ్మ వద్ద ఆశావర్కర్లతో కలిసి మహాత్మాగాంధీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జంగయ్య, యూపీహెచ్‌సీల ఆశాలు రాజేశ్వరీ, ఆండాలు, లక్ష్మీబాయి, శ్రీలత, రజిని, చైతన్య, శాంత తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివచంద్ర

సంతోష్‌నగర్: తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర సూచించారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోని రక్షాపురం రోడ్డులో పిల్లలు ప్రాంక్ వీడియోలు చేస్తూ స్థానికంగా ఇబ్బందులకు గురి చేయడంపై మంగళవారం ఆయన చిన్నారులు, వారి తల్లిదండ్రులకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇకపై రోడ్లపై ఇలాంటి వీడియోలు చేయకూడదని ఆయన హెచ్చరించారు.

సుస్థిర జీవన విధానం అలవర్చుకోవాలి



కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్

చార్మినార్: స్థిరమైన నగరాలు, సుస్థిరమైన జీవన విధానానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సంస్థ సిటీ కాలేజీలో అక్టోబర్ 3–4వ తేదీల్లో నిర్వహిస్తున్న ఇకో బూట్ కాంప్ ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంచనాకి మించి వేగంగా పట్టణీకరణ, నగరీకరణ పెరుగుతుందని.. అందుకు తగినట్లుగా సుస్థిర జీవనం కోసం అనువైన మార్గాలను అన్వేషించాలని.. ఈ విషయంలో విద్యార్థులు చేసే ఆలోచనలు అమలు చేయడానికి తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. సభకు ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అధ్యక్షత వహించగా డాక్టర్ ఫరీదా తంపాల్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ నర్మద పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. రక్షాపురం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. రియాసత్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

తాగునీటి కటకట



సుల్తాన్‌షాహీలో బిందెలతో నిరసన తెలుపుతున్న స్థానికులు

- సుల్తాన్‌షాహీలో ఏళ్ల తరబడి తాగునీటి ఎద్దడి
- సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్న జలమండలి
- పట్టించుకోని అధికారులు

చార్మినార్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటింటికీ తాగునీటి సరఫరా పేరుతో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి చిట్టచివరన ఉన్న మారుమూల గ్రామాల ప్రజల దాహార్తి తీరుస్తుండగా.. పాతబస్తీలోని సుల్తాన్‌షాహీ బస్తీ ప్రజలు ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పాతబస్తీకి కృష్ణా జలాలతో పాటు హిమాయత్‌సాగర్ జలాశయం నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. సాధారణంగా పాతబస్తీలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతున్నప్పటికీ.. ఎస్సీ, ఎస్టీ పేద ప్రజలు అధికంగా నివసించే సుల్తాన్‌షాహీ బస్తీలో మాత్రం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంప్రదించకపోవడంతో మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. జలమండలి అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుల్తాన్‌షాహీలోని వాల్మీకినగర్, హనుమాన్ టెంపుల్ వీధి, సుల్తాన్‌షాహీ జూలా తదితర వీధుల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు.

పదేళ్లుగా తాగునీటి సమస్య..



మొఘల్‌పురా జలమండలి ఏఈ పరిధిలోని మా బస్తీలో పదేళ్లుగా తాగునీటి సమస్య వెంటాడుతోంది. గతంలో ఎన్నోసార్లు మొఘల్‌పురా డీజీఎంతో పాటు ఏఈ కార్యాలయాల ముందు ఖాళీ బిందెలతో మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్‌తో పాటు ఎమ్మెల్యే సైతం తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదు. ఎస్సీ, ఎస్టీ పేద ప్రజలమైనందుకే తమపై జలమండలి అధికారులు వివక్ష చూపుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– ప్రవీణ్ బాగ్డీ, సుల్తాన్ షాహీ

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా...

సుల్తాన్‌షాహీలో తాగునీటి సమస్య ఉన్న విషయం ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. జలమండలికి సామాజికంగా ఎవరిపైనా ఎలాంటి వివక్ష ఉండదు. అన్ని వర్గాల ప్రజల దాహార్తి తీర్చడం కోసం మేమంతా పని చేస్తున్నాం. ఎక్కడైనా తాగునీటి కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆయా సమస్యను పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– కృష్ణ నాయక్, జనరల్ మేనేజర్, జలమండలి డివిజన్–1

అర్హులైన వారికి దుకాణాలు కేటాయించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రదీప్‌రాజ్, పప్పుమాత్రే శైలేష్

అబిడ్స్: బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో అర్హులైనవారందరికీ వెంటనే దుకాణాలు కేటాయించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రాజ్, పప్పుమాత్రే, కోటిశైలేష్ కురుమ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రేకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దుకాణాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గతంలో అర్హులైనవారందరికీ దుకాణాలు కేటాయించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. చట్టప్రకారం అధికారులు సర్వే నిర్వహించి దుకాణాలు కేటాయిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో శైలేష్ కురుమతో పాటు గోపాల్ సింగ్, ఫతేసింగ్, జైపాల్ సింగ్, శివ్‌దర్శన్, ఠాకూర్ సింగ్, సర్దార్ సింగ్, శ్యామ్ సింగ్, రామ్‌గోపాల్ సింగ్, సంతోష్ సింగ్ పాల్గొన్నారు.

కార్వాన్ బీజేపీ టికెట్ కోసం వినతి



ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్‌యాదవ్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం నుంచి యాదవుడైన తనకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరినట్లు గోల్కొండ జిల్లా బీజేపీ డేయిరి సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్ తెలిపారు. మంగళవారం బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ నివాసానికి కార్వాన్ నియోజకవర్గానికి చెందిన యాదవ సంఘాల ప్రతినిధులతో కలిసి వెళ్లి టికెట్ కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం శివకుమార్‌యాదవ్ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ ఎంతో పటిష్టతతో పనిచేస్తుందని, అలాగే యాదవులు సుమారు 25 వేలకు పైగా జనాభా ఉన్నారని, తనకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్‌ను కేటాయిస్తే అఖండ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. యాదవ సంఘాల ప్రతినిధులు శివ్‌లాల్‌యాదవ్, రమేష్‌యాదవ్, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం పాతబస్తీ మూసాబౌలి, గొల్లకిడికి తదితర ప్రాంతాల్లో రూ.2.2 కోట్ల నిధులతో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో పార్లమెంటు పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్‌లతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు రాజేశ్వర్‌రావు, ఆర్.దీపేశ్ రాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరించండి



జీఎం జాన్ షరీఫ్‌తో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని వాటర్ బోర్డుకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బోర్డు పరిధిలోని పలు సెక్షన్ కార్యాలయాల ప్రాంతాల్లో లో ప్రెషర్ వాటర్, కలుషిత నీరు కూడా సరఫరా అవుతుందన్నారు. మంగళవారం జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌తో ఆయన సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..ముల్తానీపురాలో కలుషితనీటి సరఫరా అవుతుందని జీఎం జాన్‌షరీఫ్‌కు వివరించగా ఆయన వెంటనే చర్యలు ప్రారంభించారన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో వాటర్‌బోర్డు సమస్యలను, అభివృద్ధి పనులను, ఇతర అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామన్నారు. జీఎం జాన్‌షరీఫ్ మాట్లాడుతూ..తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. డీజీఎంలను, మేనేజర్‌లను ఆయా ప్రాంతాలకు పంపించి అక్కడికక్కడే సమస్యల పరిష్కారం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాస్, మేనేజర్‌లు కులశేఖర్, మధుసుదనచారి, రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్, విజయ్ ముదిరాజ్, నరేష్‌గౌడ్, శ్రీశైలం, శ్యామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



గోల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో ఈ వారం మొత్తం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని బీజేపీ నాంపల్లి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ పవన్ కోల్లూరి అన్నారు. పండిత్ దీన్‌దయాళ్, గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీ నాంపల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం గుడిమల్కాపూర్‌లో రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్‌లోని ఆర్‌కేపేట్ ప్రాంతానికి చెందిన వంద మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి నందకిశోర్ వ్యాస్ బిలాల్ వారిని పార్టీలోకి చేర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీని చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో షభాన, వహీద్, అఖిల్ అహ్మద్, ఫయామ్, అన్వర్, హాజర్, ముస్తాఖాన్, సల్మాన్‌లు పాల్గొన్నారు.

బస్తీబాటతో సమస్యల పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: బస్తీబాటతో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గౌలివాడ బస్తీలో ఆయన ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ..గౌలివాడలోని సమస్యలన్నింటినీ సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని వివరించారు. గోషామహల్ నియోజకవర్గంలో ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

'ప్రధాని మోదీని కలవడం నా అదృష్టం'

చార్మినార్: భారత ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలువడం తన రాజకీయ జీవితంలో ఎంతో సంతోషాన్ని కలిగించిందని సీనియర్ బీజేపీ నాయకుడు బోసుపల్లి ప్రతాప్ ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ పర్యటన సందర్భంగా తాను మోదీని కలిసి అభివాదం చేసి స్వాగతం పలకడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీకి అభివాదం చేస్తున్న బోసుపల్లి ప్రతాప్

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా దర్బార్‌కు విశేష స్పందన వస్తోందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం మిరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమంలో తాను ప్రతి బస్తీలో పర్యటిస్తున్నానని అయితే వివిధ కారణాల వల్ల తనను కలవలేకపోయిన వారు ప్రజా దర్బార్‌లో వచ్చి తమ సమస్యలను విన్నవించుకుంటున్నారన్నారు. ఇప్పటి వరకు ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదుల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో లేదని ఆయన అన్నారు. మజ్లిస్ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చొరవతో మోడ్రన్ డ్రైనేజీ పనులకు సుమారు రూ.300 కోట్లు మంజూరయ్యాయని ఆయన అన్నారు. లంగర్‌హౌజ్, గోల్కొండ, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్‌లలో ఈ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. మరో వైపు టోలిచౌకి గోల్కొండ డివిజన్‌లలోని లోతట్టు ప్రాంతాల వారు సైతం ఎంతో కాలంగా ముంపు సమస్యతో సతమతమవుతున్నారని ఈ వర్షాకాలంలో ఈ సమస్య దాదాపుగా పరిష్కారం అయిందన్నారు.

'తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, బాంజావాడి తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేద, బడుగు వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు నిజమైన ఆర్థిక సహాయం అందిస్తుందని మహిళల కోసం ఎన్నో ప్రత్యేక పథకాలు అమలులోకి వస్తాయన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, రవీందర్, అహ్మద్ ఖాన్, జరీనాబేగం తదితరులున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

లంగర్‌హౌజ్: రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించిన నాడే ఆస్పత్రి ప్రజల మనన్న చోరగొంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన లంగర్‌హౌజ్ పిల్లర్ నెంబర్:106 వద్ద శ్రీకర ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్వహణలో సేవా కోణం కూడా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ప్రతినిధులు మధు గడ్డం, కిషోర్‌కుమార్, శ్రీ అశ్విన్, అఖిల్ దాడి, హామేర్ ఆలం, జునైద్ తదితరులున్నారు.



శ్రీకర ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గిరిజన యూనివర్సిటీని వెంటనే ఏర్పాటు చేయాలి



సభావత్ కల్యాణ్

చార్మినార్: కేంద్ర ప్రభుత్వ ప్రకటించిన ట్రైబల్ యూనివర్సిటీ వెంటనే ఏర్పాటు చేయాలని ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్ కోరారు. ప్రధాని మోదీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ ఏబీవీపీ విజయమే అన్నారు. దేశంలో తొలిసారిగా సమ్మక్క, సారక్క పేరు మీద యూనివర్సిటీ పెట్టడమని.. చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తుండగా జరిగిన వర్సిటీని ప్రకటించినందుకు కేంద్రానికి, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వెంటనే వర్సిటీకి మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

'ఫుట్‌బాల్'కు పెరుగుతున్న ఆదరణ



ట్రోఫీ అందజేస్తున్న నవాబ్‌కుర్రం ఖాన్

గోల్కొండ: ఫుట్‌బాల్ క్రీడకు ఆదరణ పెరుగుతుందని అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు నవాబ్ కుర్రంఖాన్ అన్నారు. గోల్కొండ ఓల్డ్ బాయ్స్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అర్జున అవార్డీ మహ్మద్ హబీబ్ మెమోరియల్ మొదటి చాంపియన్‌షిప్ ఫైనల్ పోటీ మంగళవారం గోల్కొండ రిసాలబజార్‌లోని ప్రభుత్వ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగింది. మొత్తం 12 టీమ్‌లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో హైదరాబాద్ హీరోస్ టీమ్ సికింద్రాబాద్ బ్లోవర్‌పై 4–3తో టైటిల్ నెగ్గింది. హైదరాబాద్ హీరోస్ కెప్టెన్‌కు నవాబ్ కుర్రం ఖాన్ ట్రోఫీ అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో నేడు క్రికెట్‌కు సమాంతరంగా ఫుట్‌బాల్‌కు కూడా యువకులు ఆడుతున్నారని, గల్లీలలో నేడు క్రికెట్ ఆడే వారితో పాటు ఫుట్‌బాల్ ఆడే వారు కూడా కనబడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, కోచ్ సఫదర్‌పాషా, డేవిడ్, అఫ్సర్ అహ్మద్, షమీమ్ తదితరులున్నారు.

సమాజ సేవకే వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అంకితం



కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కృష్ణమూర్తి, వరకుమార్ గుప్తా

అబిడ్స్: సమాజ సేవకే వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అంకితమయ్యిందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం అడిషనల్ ఎస్పీ పాలవరపు కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నగరంతో పాటు పలు ప్రాంతాల్లో నిరంతరం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతూ వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ముందుకు కొనసాగుతుందన్నారు. పలు పరీక్షల్లో, ఇంటర్, డిగ్రీ, ఇతర విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన మెరిట్ వైశ్య విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నగదు బహుమతులతో పాటు పలు విధాల బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతి సంవత్సరం పేద వైశ్యులతో పాటు అన్ని విధాల సమాజ సేవలు చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్ గుప్తా, ఇతర క్లబ్ నాయకులు అంబరిషా మంచాల, ఆదగుల వెంకటేష్, శృజన్ కొండూరు, పబ్బా శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్, దయాకర్ అనంతల, కొండె మాల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం భక్తామృతం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నృత్య సంస్థ కళాకృతి అకాడమీ ఆధ్వర్యంలో నృత్యగురువు డాక్టర్ సుజరిత సుందర రాజన్, సుప్రజ సుందర్‌రాజన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన భక్తామృతం ఆహుతులను ఆకట్టుకుంది. కూచిపూడి నృత్యాంశాలతో భక్తి సారాంశానికి జీవం పోస్తూ 60 మంది కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు సమ్మోహన పరిచాయి. పాద సేవ, కీర్తనలు, శ్రావణం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు మంత్రముగ్ధులను గావించాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ అరుణ భిక్షు, సిలికాన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం నృత్య నిపుణులు డాక్టర్ యశోద ఠాకూర్, భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఎల్ఐసీ రాష్ట్ర మార్కెటింగ్ రిజినల్ మేనేజర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య

డబీర్‌పురా: అనుమానాస్పదస్థితిలో గృహిణి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మాతాకి కిడికి ప్రాంతానికి చెందిన సాజిదా బేగం (45), అబ్దుల్ మాలిక్ దంపతులు. సాజిదా బేగం టైలరింగ్ శిక్షణ పొందుతుంది. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో సాజిదా బేగం తన ఇంట్లోని ఐరన్ రాడ్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితి మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.